మెయిన్ డ్రాలో నాగల్

ఇండియన్స్ వెల్: భారత యువ టెన్నిస్ స్టార్ సుమిత్ నాగల్‌కు అదృష్టం కలిసొచ్చింది. స్పెయిన్ బుల్ రఫెల్ నాదల్ పూర్తి ఫిట్‌నెస్ లేని కారణంగా టోర్నీ నుంచి తప్పుకోవడంతో నాగల్ మెయిన్ డ్రాకు అర్హత సాధించాడు. వాస్తవానికి అర్హత రెండో రౌండ్‌లో ఓటమిపాలైన నాగల్.. మెరుగైన ఏటీపీ ర్యాంకింగ్స్ (101వ) ఆధారంగా టోర్నీ ప్రధాన పోరులో నిలిచాడు. ఈ సంతోషాన్ని నాగల్ తన ఎక్స్‌లో అభిమానులతో పంచుకున్నాడు. గాయం నుంచి ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న నాదల్..ఈసారి ఎలాగైనా ఇండియన్స్ వెల్స్ టోర్నీలో పోటీపడాలనుకున్నాడు. కానీ పూర్తి స్థాయి మ్యాచ్ ఫిట్‌నెస్ సాధించడంలో విఫలమైన నాదల్..అనూహ్యంగా టోర్నీ నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించాడు.

క్వార్టర్స్‌లో సహజ

హైదరాబాద్, ఆట ప్రతినిధి: నాగ్‌పూర్ ఐటీఎఫ్ టోర్నీలో రాష్ట్ర యువ ప్లేయర్ సహజ యమ్మలపల్లి క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. గురువారం జరిగిన మహిళల సింగిల్స్ ప్రిక్వార్టర్స్ పోరులో సహజ 6-2, 6-1తో సోనాల్ పాటిల్‌పై అలవోక విజయం సాధించింది. ఆది నుంచే తనదైన జోరు కనబరిచిన సహజ..ప్రత్యర్థికి ఎక్కడా అవకాశమివ్వకుండా వరుస సెట్లలో మ్యాచ్‌ను కైవసం చేసుకుంది. తదుపరి రౌండ్‌లో డియోన్ బ్యాక్(దక్షిణకొరియా)తో తలపడుతుంది. మరోవైపు మహిళల డబుల్స్ క్వార్టర్స్‌లో శ్రీవల్లి రష్మిక, వైదేహి చౌదరి జోడీ 6-2, 7-6తో రెండో సీడ్ ద్వయం ఫ్యానీ స్టోస్ట్‌ల్యాండ్, యక్టరీనా యశీనాపై గెలిచి సెమీస్‌లోకి ప్రవేశించింది.

ముంబై మ్యాజిక్

న్యూఢిల్లీ: మహిళల ప్రీమియర్ లీగ్(డబ్ల్యూపీఎల్)లో డిఫెండింగ్ చాంపియన్ ముంబై ఇండియన్స్ మళ్లీ గెలుపు బాట పట్టింది. గురువారం జరిగిన మ్యాచ్‌లో ముంబై 42 పరుగుల తేడాతో యూపీ వారియర్స్‌పై ఘన విజయం సాధించింది. ముంబై నిర్దేశించిన 161 పరుగుల లక్ష్యఛేదనలో యూపీ 118-9 స్కోరుకు పరిమితమైంది. దీప్తిశర్మ(53 నాటౌట్) మినహా అందరూ సింగిల్ డిజిట్ స్కోర్లు చేశారు. సైకా ఇషాక్ (3-27), బ్రంట్ (2-14) యూపీ పతనంలో కీలకమయ్యారు.

కుల్దీప్ కమాల్

ఐదు వికెట్లతో విజృంభణ

అశ్విన్‌కు నాలుగు వికెట్లు • ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్ 218 ఆలౌట్

భారత్ తొలి ఇన్నింగ్స్ 135-1

ధర్మశాలలో భారత్ దుమ్మురేపుతున్నది. సిరీస్‌ను 4-1తో కైవసం చేసుకోవాలన్న కసితో ఉన్న టీమ్‌ఇండియా..ఇంగ్లండ్‌పై ఆధిపత్యం చెలాయిస్తున్నది. హిమాలయ పర్వత సానువుల్లో గురువారం మొదలైన ఆఖరిదైన ఐదో టెస్టులో ఇంగ్లండ్ భరతం పట్టింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన స్టోక్స్‌సేనను కుల్దీప్‌యాదవ్, అశ్విన్ స్పిన్ తంత్రంతో కుప్పకూల్చారు. ఫ్లాట్‌పిచ్‌పై బంతిని గింగిరాలు తిప్పుతూ ఇంగ్లిష్ బ్యాటర్లను ఔట్ చేశారు. బంతి ముట్టుకుంటే మసే అన్న రీతిలో కుల్దీప్ చెలరేగగా, వందో టెస్టు ఆడుతున్న అశ్విన్ తన అనుభవాన్ని రంగరించి ఆఖరి వరుస బ్యాటర్ల పనిపట్టాడు. ఫలితంగా 218 పరుగులకే పరిమితమైన ఇంగ్లండ్.. బౌలింగ్‌లోనూ పేలవ ప్రదర్శన కనబరిచింది. యశస్వి జైస్వాల్, రోహిత్‌శర్మ అర్ధసెంచరీలతో భారత్ మెరుగైన స్థితిలో ఉంది.

కుల్దీప్‌యాదవ్ (5-72)

ధర్మశాల: భారత్, ఇంగ్లండ్ మధ్య గురువారం మొదలైన ఐదో టెస్టు ఆసక్తికరంగా సాగుతున్నది. హిమాలయ పర్వత శ్రేణుల్లో చలిగాలుల మధ్య రెండు జట్లు హోరాహోరీగా తలపడుతున్నాయి. సిరీస్ ఇప్పటికే ఖాతాలో వేసుకున్న రోహిత్‌సేన ఆధిక్యంపై కన్నేస్తే..మరోవైపు ఆఖరి పోరులోనైనా పరువు నిలుపుకునేందుకు ఇంగ్లండ్ ప్రాకులాడుతున్నది. తొలుత టాస్ గెలిచి రెండో ఆలోచన లేకుండా బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్..మూల్యం చెల్లించుకుంది. ఫ్లాట్‌పిచ్‌పై భారత బౌలర్లను దీటుగా ఎదుర్కొంటూ భారీ స్కోరు సాధిద్దామనుకున్న ఇంగ్లండ్‌కు సీన్ రివర్స్ అయ్యింది. ఇంగ్లిష్ జట్టు విఫలమైన చోట భారత బ్యాటర్లు ఇరుగదీశారు. ఓపెనర్లు యశస్వి జైస్వాల్(57), రోహిత్‌శర్మ(52 నాటౌట్) అర్ధసెంచరీలతో కదంతొక్కగా, శుభ్‌మన్ గిల్(26 నాటౌట్) ఆకట్టుకున్నాడు. వీరి రాణింపుతో భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 135-1 స్కోరు చేసింది. చేతిలో 9 వికెట్లు ఉన్న టీమ్ ఇండియా ప్రస్తుతం 83 పరుగుల దూరంలో ఉంది. షోయబ్ బషీర్ (1-64) ఒక వికెట్ దక్కించుకున్నాడు. అంతకముందు ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో 218 పరుగులకు పరిమితమైంది. ఓపెనర్ జాక్ క్రాలీ (79) అర్ధసెంచరీ మినహా అందరూ స్వల్ప స్కోర్లకే పరిమితమయ్యారు. కుల్దీప్‌యాదవ్(5-72), అశ్విన్ (4-51) విజృంభించారు. ముఖ్యంగా చైనామన్ స్పిన్నర్ కుల్దీప్..ఇంగ్లండ్ పతనంలో కీలకమయ్యాడు. ఈ మ్యాచ్ ద్వారా యువ క్రికెటర్ దేవదత్ పడిక్కల్..టీమ్‌ఇండియా తరపున అరంగేట్రం చేశాడు. ధర్మశాల పోరుతో అశ్విన్, బెయిర్‌స్టో వంద టెస్టు మ్యాచ్‌ల క్లబ్‌లో చేరారు.

కుల్దీప్ విజృంభణ:

టాస్ నెగ్గి బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్‌కు ఒకింత మెరుగైన శుభారంభమే దక్కింది. ఓపెనర్లు జాక్ క్రాలీ, బెన్ డకెట్ దూకుడుగా ఆడారు. ఈ క్రమంలో పేసర్లు బుమ్రా, సిరాజ్‌ను సమర్థంగా ఎదుర్కొంటూ పరుగులు రాబట్టారు. అయితే బౌలింగ్ మార్పుగా వచ్చిన కుల్దీప్‌యాదవ్.. ఇంగ్లండ్ వికెట్ల వేటకు తెరతీశాడు. తొలుత డకెట్(27)ను..శుభమన్ గిల్ సూపర్ క్యాచ్ ద్వారా పెవిలియన్ పంపాడు. కుల్దీప్ బంతిని షాట్ ఆడబోయిన డకెట్..గిల్ వెనుకకు పరిగెడుతూ పట్టిన క్యాచ్ మ్యాచ్‌కే హైలెట్‌గా నిలిచింది. 36 పరుగుల తేడాతో ఒలీపోప్(11) ఔటయ్యాడు. కుల్దీప్ విసిరిన ఊరించే బంతిని ఆడే క్రమంలో పోప్..స్టంప్ ఔట్ అయ్యాడు. ఓవైపు సహచరులు ఔట్ అవుతున్నా..దూకుడు తగ్గించని క్రాలేను కుల్దీప్ బోల్తా కొట్టించాడు. తన అమ్ములపొదిలోని గూగ్లీని సంధిస్తూ క్రాలీని క్లీన్‌బౌల్డ్ చేశాడు. దీంతో 137 పరుగులకే ముగ్గురు టాపార్డర్ బ్యాటర్లు పెవిలియన్ చేరారు. ఇక్కణ్నుంచి మరింత జోరు పెంచిన కుల్దీప్‌యాదవ్..బెయిర్‌స్టో(29), కెప్టెన్ బెన్ స్టోక్స్(0)ను ఔట్ చేస్తే..రూట్(26)ను జడేజా సాగనంపాడు. దీంతో 175 పరుగుల స్కోరు వద్ద ఇంగ్లండ్ మూడు కీలక వికెట్లు చేజార్చుకుని పీకల్లోతు కష్టాల్లో కూరుకుపోయింది. వందో టెస్టు ఆడుతున్న బెయిర్‌స్టో..కీపర్ జురెల్ క్యాచ్‌తో ఔట్ కాగా, స్టోక్స్ వికెట్ల ముందు అడ్డంగా దొరికిపోయాడు. టాపార్డర్‌ను కుల్దీప్ దెబ్బ తీస్తే..లోయార్డర్‌ను అశ్విన్ పనిపట్టాడు. టామ్ హార్ట్‌లే(6), మార్క్‌వుడ్(0), బెన్ ఫోక్స్(24), అండర్సన్(5) వరుస విరామాల్లో అశ్విన్ పెవిలియన్ పంపాడు. మొత్తంగా 81 పరుగుల తేడాతో ఇంగ్లండ్ చివరి ఏడు వికెట్లు కోల్పోయింది.

భారత్ దూకుడుగా:

ఇంగ్లండ్ తడబడ్డ చోట భారత బ్యాటర్లు సాధికారికంగా ఇన్నింగ్స్‌తో రాణించారు. సిరీస్‌లో సూపర్‌ఫామ్‌మీదున్న యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్, కెప్టెన్ రోహిత్‌శర్మ జట్టుకు అదిరిపోయే ఆరంభాన్ని ఇచ్చారు. వీరిద్దరు ఇంగ్లండ్ బౌలర్లను అవలీలగా ఎదుర్కొంటూ స్కోరుబోర్డును పరిగెత్తించారు. ముఖ్యంగా జైస్వాల్..ఇంగ్లిష్ బౌలర్లను ఓ ఆటాడుకున్నాడు. స్పిన్నర్ షోయబ్ బషీర్‌ను లక్ష్యంగా చేసుకుంటూ జైస్వాల్ మూడు కండ్లు చెదిరే సిక్స్‌లతో ఆకట్టుకున్నాడు. మరో ఎండ్‌లో 151కి.మీ వేగంతో మార్క్ వుడ్ విసిరిన బంతిని అంతే వేగంతో రోహిత్..సిక్స్‌గా మలిచి వారెవ్వా అనిపించుకున్నాడు. ఇలా ఇద్దరు బౌండరీలు అవలీలగా బాదుతూ స్కోరుబోర్డుకు కీలక పరుగులు జతచేశారు. ఇన్నింగ్స్ జోరందుకుంటున్న తరుణంలో బషీర్ బౌలింగ్‌లో వరుసగా రెండు బౌండరీలు బాదిన జైస్వాల్..స్టంప్ ఔట్‌గా వెనుదిరిగాడు. దీంతో తొలి వికెట్‌కు 104 పరుగుల భాగస్వామ్యానికి బ్రేక్ పడింది. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన గిల్(26 నాటౌట్)..రోహిత్‌కు జతకలిశాడు. మరో వికెట్ పడకుండా జాగ్రత్తపడ్డ వీరిద్దరు 135-1 వద్ద తొలిరోజును ముగించారు. ఈ క్రమంలో రోహిత్ అర్ధసెంచరీ మార్క్ అందుకున్నాడు.

2 **ఒక టెస్టు సిరీస్‌లో అత్యధిక పరుగులు చేసిన భారత బ్యాటర్‌గా యశస్విజైస్వాల్ (712) నిలిచాడు. మాజీ కెప్టెన్ సునీల్ గవాస్కర్ (774, 732) రెండుసార్లు ఈ ఫీట్ అందుకున్నాడు.**

సంక్షిప్త స్కోర్లు

ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్: 218 ఆలౌట్ (క్రాలే 79, బెయిర్‌స్టో 29, కుల్దీప్‌యాదవ్ 5-72, అశ్విన్ 4-51), భారత్ తొలి ఇన్నింగ్స్: 135-1(జైస్వాల్ 57, రోహిత్ 52 నాటౌట్, బషీర్ 1-64)

సింధు గెలుపు జోరు

• ఫ్రెంచ్ బ్యాడ్మింటన్ టోర్నీ

పారిస్: ఫ్రెంచ్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీలో భారత స్టార్ షట్లర్ పీవీ సింధు గెలుపు జోరు దిగ్విజయంగా కొనసాగుతున్నది. గురువారం జరిగిన మహిళల సింగిల్స్ ప్రిక్వార్టర్స్‌లో సింధు 13-21, 21-10, 21-14 తేడాతో బివాన్ జాంగ్(అమెరికా)పై అద్భుత విజయం సాధించింది. దీంతో ఈ సీజన్‌లో తొలిసారి క్వార్టర్స్ చేరి సత్తాచాటింది. ఇటీవలే గాయం నుంచి తేరుకున్న సింధు తన అత్యుత్తమ ఆటతీరును ప్రదర్శించింది. పారిస్ ఒలింపిక్స్‌లో ఎలాగైనా పతకం సాధించాలన్న కసితో సింధు దూకుడు కనబరిచింది. అయితే తొలి గేమ్‌లో సింధు ఓవైపు అనవసర తప్పిదాలకు పాల్పడితే..జాంగ్ క్రాస్‌కోర్ట్ షార్ట్‌లతో కీలక పాయింట్లు ఖాతాలో వేసుకుంది. మొదటి గేమ్‌ను దక్కించుకున్న జోష్‌తో రెండో గేమ్‌లోనూ జాంగ్ 3-0 ఆధిక్యం కనబరిచింది. ఒక్కసారిగా పుంజుకుని పోటీలోకి వచ్చిన సింధు మళ్లీ వెనుదిరిగి చూసుకోలేదు. తన ఆధిక్యాన్ని అంతకంతకూ పెంచుకుంటూ పోయిన సింధు..రెండో గేమ్‌ను దక్కించుకుంది. నిర్ణయాత్మక మూడో గేమ్‌లోనూ అదే జోష్ కనబరిచినా.. ఈ తెలుగు షట్లర్ మ్యాచ్‌ను కైవసం చేసుకుంది. మరోవైపు పురుషుల సింగిల్స్‌లో కిడాంబి శ్రీకాంత్..21-19, 12-21, 20-22 తేడాతో లు గువాంగ్ జు(చైనా) చేతిలో ఓడి టోర్నీ నుంచి నిష్క్రమించాడు.

రాజా రిత్విక్‌కు రజతం

• జాతీయ బ్లిట్జ్ చెస్ చాంపియన్‌షిప్

నాసిక్: తెలంగాణ యువ గ్రాండ్‌మాస్టర్ రాజారిత్విక్ వరుస టైటిళ్ల జోరు కొనసాగుతున్నది. జాతీయ చెస్ చాంపియన్‌షిప్‌లో ఇప్పటికే కాంస్యం(ర్యాపిడ్) సొంతం చేసుకున్న రిత్విక్ తాజాగా బ్లిట్జ్ విభాగంలో రజతం ఒడిసిపట్టుకున్నాడు. గురువారంతో ముగిసిన టోర్నీలో రిత్విక్..మొత్తం 11 రౌండ్లలో 9 పాయింట్లు ఖాతాలో వేసుకుని రెండో స్థానంలో నిలిచాడు. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి మొత్తం 224 మంది టాప్ చెస్ ప్లేయర్లు ఈ టోర్నీలో పోటీపడ్డారు. మొత్తం టోర్నీలో ఏడు గేముల్లో గెలిచిన ఈ యువ జీఎం నాలుగు గేమ్‌లను డ్రా చేసుకున్నాడు. జీఎం ఘోష్ దిప్తాయన్(9.5) స్వర్ణం దక్కించుకోగా, ఎఫ్‌ఎం వాచ్ ఇధాన్(9) కాంస్యం కైవసం చేసుకున్నాడు. జాతీయ చెస్ చాంపియన్‌షిప్‌లో రెండు పతకాలు సాధించిన రిత్విక్‌ను రాష్ట్ర చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రసాద్ అభినందించారు.

అజీజ్‌నగర్‌లోని హెచ్‌పీఆర్‌సీ వేదికగా జరుగుతున్న ఇంటర్నేషనల్ ఎరెనా పోలో చాంపియన్‌షిప్‌లో గురువారం జరిగిన మ్యాచ్‌లో అమెరికా 13-9 తేడాతో స్పెయిన్‌పై గెలిచింది. అమెరికా తరపున క్లెంటర్(7), స్టెఫాంకిస్(5) రాణించారు.

సింగరేణికి తాడిచర్ల కోల్ బ్లాక్-2!

సానుకూలత వ్యక్తం చేసిన కేంద్రం • డిప్యూటి సీఎం భట్టి విక్రమార్క వెల్లడి

హైదరాబాద్, మార్చి 7 (నమస్తే తెలంగాణ): తాడిచర్ల కోల్ బ్లాక్-2లో సింగరేణి సంస్థ బొగ్గు ఉత్పత్తి చేయడానికి కేంద్రం సానుకూలత వ్యక్తం చేసిందని, త్వరలోనే అప్రూవల్ వస్తుందన్న ఆశాభావాన్ని రాష్ట్ర డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క వ్యక్తం చేశారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న ఆయన.. సింగరేణికి కావాల్సిన గనులు, ఇతరత్రా సమస్యల పరిష్కారం కోసం గురువారం కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషిని, వర్చువల్ మీటరింగ్ విధానంతో పేదల ఇండ్లకు సౌర విద్యుత్తును అందించే విషయమై కేంద్ర విద్యుత్తు శాఖ మంత్రి ఆర్‌కే సింగ్‌ను కలిశారు. వారికి వినతి పత్రాలు అందజేశారు. అనంతరం అక్కడ మీడియాతో మాట్లాడుతూ.. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని తాడిచర్ల కోల్ బ్లాక్-2ను 2019లోనే సింగరేణికి కేటాయించారని గుర్తుచేశారు. 30 ఏండ్లపాటు 182 మిలియన్ టన్నుల బొగ్గు నిక్షేపాలను ఇక్కడ వెలికితీసే అవకాశముందని తెలిపారు. అలాగే జైపూర్ పవర్ ప్లాంట్‌లో థర్మల్ విద్యుదుత్పత్తి కోసం సింగరేణికి ఒడిశాలో కేటాయించిన నైని బొగ్గు గనుల్లో తవ్వకాలకున్న అడ్డంకులను తొలగించాలని కూడా జోషికి విన్నవించినట్టు భట్టి తెలియజేశారు. దీంతో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రితో మాట్లాడి అన్ని అనుమతులు వచ్చేలా ప్రయత్నిస్తానని కేంద్ర మంత్రి హామీ ఇచ్చారన్నారు. ఇక కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ప్రధాన మంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజిలి యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకుంటామన్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం చేసిన ప్రతిపాదనలపై కేంద్ర మంత్రి సింగ్ సానుకూలంగా స్పందించారని భట్టి తెలియజేశారు. త్వరలోనే ఓ నిర్ణయం తీసుకుంటామని చెప్పారన్నారు. ఈ పర్యటనలో భట్టి వెంట ఇంధన శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సయ్యద్ అలీ ముర్తుజా రిజ్వీ, సింగరేణి సీఎండీ ఎన్ బలరాం తదితరులున్నారు.

వాసవి గ్రూప్ బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న సంస్థ బ్రాండ్ అంబాసిడర్, సినీహీరో వెంకటేశ్. చిత్రంలో కంపెనీ సీఎండీ విజయ్‌కుమార్ తదితరులు

వాసవి గ్రూప్ ప్రచారకర్తగా వెంకటేశ్

కొండాపూర్, మార్చి 7: ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ వాసవి గ్రూపు ప్రచారకర్తగా టాలీవుడ్ హీరో వెంకటేశ్ నియమితులయ్యారు. ఈ విషయాన్ని కంపెనీ గురువారం అధికారికంగా ప్రకటించింది. హైదరాబాద్‌లోని జేఆర్‌సీ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో హీరో వెంకటేశ్‌తో కలిసి వాసవి గ్రూపు సీఎండీ ఎర్రం విజయ్‌కుమార్‌లు కొంపల్లిలో నూతనంగా ప్రారంభించిన వాసవి భువి, వాసవి ఆవాస ప్రాజెక్టులకు సంబంధించిన బ్రోచర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హీరో వెంకటేశ్ మాట్లాడుతూ..రియల్ ఎస్టేట్ రంగంలో తమ కంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకున్న వాసవి గ్రూపు బ్రాండ్ అంబాసిడర్‌గా ఉండటం చాలా సంతోషంగా ఉన్నదని, అత్యాధునిక సాంకేతికతతో కమ్యూనిటీలను అభివృద్ధి చేస్తూ అన్ని వర్గాల వారికి నాణ్యతతో కూడిన సొంతింటిని అందించడంలో కృషి చేస్తున్న వాసవి గ్రూపు సభ్యులను ప్రత్యేకంగా అభినందిస్తున్నట్లు చెప్పారు. అనంతరం విజయ్ కుమార్ మాట్లాడుతూ..అన్ని వర్గాలకు డ్రీమ్ హోమ్స్ అందించడంలో వాసవి గ్రూపు ముందు వరుసలో ఉంటున్నదన్నారు. వాసవి గ్రూపు ఇప్పటికే 30 రెసిడెన్షియల్ ప్రాజెక్టులు, 17 కమర్షియల్ ప్రాజెక్టులు, 310 ఎకరాల స్థలంలో విల్లాలు, 4,510 అపార్ట్‌మెంట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. కొంపల్లిలో 10.65 ఎకరాల స్థలంలో నిర్మించతలపెట్టిన ప్రాజెక్టులో 8 టవర్లు, 17 అంతస్తులు, 2, 2.5, 3 బీహెచ్‌కేలను అందించనున్నట్లు తెలిపారు.

తులం 72,000!

ఈ ఏడాది తాకుతుందన్న అంచనాలు

రూ.90,000 దిశగా కిలో వెండి

న్యూఢిల్లీ, మార్చి 7: బంగారం ధరలు ముమ్ముందు మరింతగా పెరిగే అవకాశాలే కనిపిస్తున్నాయి. ఇప్పటికే రికార్డు స్థాయిల్లో కదలాడుతున్న పుత్తడి విలువ.. ఈ ఏడాది సరికొత్త శిఖరాలనే అధిరోహిస్తుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ క్రమంలోనే ఈ సంవత్సరం 10 గ్రాములు రూ.72,000 పలుకుతుందన్న అంచనా ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. దేశ, విదేశీ స్టాక్ మార్కెట్ల తీరుతెన్నులు, భౌగోళిక రాజకీయ పరిస్థితులు, ఆయా దేశాల సెంట్రల్ బ్యాంకుల విధానాలు, ప్రపంచ ఆర్థిక వ్యవస్థ వృద్ధిరేటు, డాలర్ ఇండెక్స్, భారత్ సహా పలు ప్రధాన దేశాల్లో ఎన్నికలు.. కలిసి పసిడి ధరల్ని ఎగదోయవచ్చన్న విశ్లేషణలు ఇప్పుడు వస్తున్నాయి.

ఆకర్షణీయంగా..

బంగారం అంటే ఇప్పుడు ఓ పెట్టుబడి. ఒకప్పుడు కేవలం అలంకరణలో భాగంగానే ఉన్న పుత్తడి.. నేడు అంతకుమించేనని చెప్పక తప్పదు. అందుకే భౌతిక రూపం నుంచి పత్రాలు, డిజిటల్‌గానూ గోల్డ్ మారిపోయింది. మదుపరులకు బంగారం ఓ సురక్షిత పెట్టుబడి సాధనంగా తయారైందంటే విషయాన్ని అవగతం చేసుకోవచ్చు. ఇందుకు తగ్గట్టే గత ఏడాది మదుపరులకు బంగారంపై పెట్టుబడులు దాదాపు 15 శాతం రాబడుల్ని అందించాయి. దీంతో ఈ ఏడాది కూడా ఇన్వెస్టర్లకు గోల్డ్ అత్యంత ఆకర్షణీయమనే చెప్పుకోవచ్చని మెజారిటీ ట్రేడర్లు అంటున్నారు. ముఖ్యంగా ఈ ఏడాది అమెరికా ఫెడరల్ రిజర్వ్ బ్యాంక్.. తమ వడ్డీరేట్లను కనీసం మూడుసార్లైనా తగ్గించనుందన్న అంచనాలున్నాయి. ఇదే జరిగితే అమెరికా బాండ్ ఈల్డ్స్ మరింత పడిపోవడం ఖాయం. ఈ పరిణామం చివరాఖరికి పుత్తడి ధరలు పెరిగేందుకే దారితీస్తుందని చెప్తున్నారు.

సెంట్రల్ బ్యాంకులతో..

పసిడి విషయంలో ఆయా దేశాల సెంట్రల్ బ్యాంకులు వ్యవహరిస్తున్న తీరు కూడా మార్కెట్‌లో ధరల్ని పెంచేస్తున్నది. అంతర్జాతీయ పరిణామాలతో దేశ ఆర్థిక వ్యవస్థకు ముప్పు వాటిల్లకుండా రిజర్వ్ బ్యాంకులు బంగారాన్నే రక్షణ కవచంగా ఎంచుకున్నాయి. గత 13 ఏండ్లుగా రిజర్వ్ బ్యాంకుల వద్ద స్థిరంగా పెరుగుతున్న పసిడి నిల్వలే ఇందుకు నిదర్శనం. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) వద్ద కూడా పెద్ద ఎత్తునే గోల్డ్ రిజర్వులున్నాయి. నిరుడు సెప్టెంబర్ ఆఖరు నాటికి 807 టన్నుల బంగారం ఉన్నట్టు అంచనా. అమెరికా, చైనా, జపాన్‌తో పాటు ఆయా యూరో దేశాలూ భారత్ కంటే ఎక్కువే బంగారం నిల్వల్ని పోగేశాయి. ఇక సెంట్రల్ బ్యాంకుల వడ్డీరేట్ల పెంపుతో ప్రపంచ ఆర్థిక వృద్ధిరేటు మందగిస్తున్నదని అంతర్జాతీయ ద్రవ్యనిధి చెప్తున్నది. దీంతో మదుపరులు తమ పెట్టుబడులను ఇంకాస్త పసిడి వైపు మళ్లిస్తున్నారని, ఫలితంగా డిమాండ్ పెరిగి రేట్లు రికార్డుల్ని సృష్టిస్తున్నాయన్న వాదనలూ ఉన్నాయి. మిడిల్‌ఈస్ట్, రష్యా-ఉక్రెయిన్ ఆందోళనలూ బంగారం రేట్లకు రెక్కల్ని తొడుగుతున్నాయని ఇంకొందరి అభిప్రాయం.

ఆగని రికార్డు పరుగులు



బంగారం ధరలు వరుస రికార్డుల్ని నెలకొల్పుతున్నాయి. గురువారం ఢిల్లీలో 24 క్యారెట్ 10 గ్రాములు మరో రూ.500 పుంజుకొని రూ.65,650 వద్దకు చేరింది. దీంతో నూతన ఆల్‌టైమ్ హై రికార్డు ఏర్పడింది. హైదరాబాద్‌లోనూ 24 క్యారెట్ పసిడి తులం రూ.430 ఎగిసి రూ.65,560గా ఉన్నది. 22 క్యారెట్ రూ.400 ఎగబాకి రూ.60,100 పలికింది. ఇక కమోడిటీస్ మార్కెట్‌లో కామెక్స్ స్పాట్ గోల్డ్ ఔన్సు విలువ ఏకంగా 2,161.50 డాలర్లకు చేరింది. ఈ క్రమంలోనే ఒకానొక దశలో తులం రూ.67వేలదాకా పలికింది. వెండి 24.10 డాలర్లుగా ఉన్నది. ఫెడ్ రిజర్వ్ చీఫ్ జెరోమ్ పావెల్.. ఈ ఏడాది వడ్డీరేట్లు తగ్గుతాయని పునరుద్ఘాటించడమే ఇందుకు కారణమని ట్రేడర్లు విశ్లేషిస్తున్నారు. అలాగే వెండి కిలో ఢిల్లీలో రూ.400 పెరిగి రూ.74,900గా ఉన్నది. హైదరాబాద్‌లో రూ.500 అందుకుని రూ.78,500 పలికింది. ఈ నేపథ్యంలో ఈ ఏడాది చివరికల్లా కిలో రూ.90,000 దరిదాపుల్లోకి వెళ్లవచ్చన్న అంచనాలు వ్యక్తమవుతున్నాయి. పరిశ్రమల నుంచి డిమాండ్ పెరుగుతుండటమే ప్రధాన కారణమని చెప్తున్నారు.

వాణిజ్య

మహిళలకు బీవోబీ ఆఫర్లు

న్యూఢిల్లీ, మార్చి 7: ప్రభుత్వరంగ సంస్థ బ్యాంక్ ఆఫ్ బరోడా(బీవోబీ)..అంతర్జాతీయ మహిళాదినోత్సవం సందర్భంగా మహిళా ఖాతాదారులకు ప్రత్యేక ఆఫర్లు ప్రకటించింది. ఈ ఏడాది జూన్ 30లోగా బీవోబీ మహిళా శక్తి సేవింగ్స్ అకౌంట్ లేదా బీవోబీ వుమెన్ పవర్ కరెంట్ అకౌంట్ తీసుకున్నవారికి ఈ ఆఫర్లు వర్తించనున్నది. అలాగే డిసెంబర్ 31, 2024 వరకు రుణాలు తీసుకునేందుకు అవకాశం కల్పించింది. వీరు తీసుకునే రుణాలపై 25 బేసిస్ పాయింట్లు వడ్డీ రాయితీ కల్పిస్తున్నది బ్యాంక్. వీటిలో ద్విచక్ర వాహన రుణాలపై పావు శాతం, విద్యా రుణాలపై 0.15 శాతం, వాహన రుణాలపై 10 బేసిస్ పాయింట్లు, గృహ, మార్ట్‌గేజ్ రుణాలపై వడ్డీ రాయితీ ఇస్తున్నది. అలాగే రిటైల్ రుణాలపై ప్రాసెసింగ్ చార్జీలను బ్యాంక్ ఎత్తివేసింది. లాకర్ల చార్జీలపై 50 శాతం డిస్కౌంట్ ఇస్తున్నది.

7సీస్‌కు ఫిక్కీ అవార్డు

హైదరాబాద్, మార్చి 7: ప్రముఖ గేమింగ్ సంస్థ 7సీస్ ఎంటర్‌టైన్‌మెంట్ లిమిటెడ్‌కు ప్రతిష్ఠాత్మక బెస్ట్ అనిమేటెడ్ ఫ్రేమ్స్ అవార్డు వరించింది. బెస్ట్ ఇండియన్ గేమింగ్ విభాగంలో ఈ అవార్డును ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ(ఫిక్కీ) అందచేసింది. ఈ ప్రతిష్ఠాత్మక అవార్డు కంపెనీ ఎండీ మారుతి శంకర్ ఇటీవల అందుకున్నారు.

మొబైల్ ఎగుమతులు ఐదింతలు

భవిష్యత్తులో 60 బిలియన్ డాలర్లకు చేరుకునే అవకాశం

న్యూఢిల్లీ, మార్చి 7: పదేండ్ల క్రితం మొబైల్ దిగుమతి చేసుకునే స్థాయి నుంచి ఎగుమతి చేసుకునే స్థాయికి భారత్ ఎదిగింది. ఇదే క్రమంలో భవిష్యత్తులో భారత్ నుంచి 50-60 బిలియన్ డాలర్ల విలువైన మొబైల్ ఫోన్లు ఎగుమతి కానున్నాయని కేంద్ర ఐటీ, కమ్యూనికేషన్స్ మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. గడిచిన సంవత్సరంలో 11 బిలియన్ డాలర్ల విలువైన ఉత్పత్తులు ఎగుమతి అయ్యాయి. బుధవారం జరిగిన ఫిన్‌టెక్ సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..అలాగే ప్రస్తుతం ఎలక్ట్రానిక్స్ తయారీ రంగంలో 10 లక్షల మంది ఉపాధి పొందుతుండగా, భవిష్యత్తులో ఈ సంఖ్య 25 లక్షలకు చేరుకుంటుందని ఆశిస్తున్నట్లు చెప్పారు. పదేండ్ల క్రితం 98 శాతం మొబైల్ ఫోన్లు దిగుమతి చేసుకుంటుండగా..ప్రస్తుతం 99 శాతం డివైజ్‌లు ఇక్కడే తయారవుతున్నాయన్నారు. గత పదేండ్లలో దేశవ్యాప్తంగా విమానాశ్రయాల సంఖ్య రెండింతలు పెంచినట్లు, అలాగే రైల్వే కిలోమీటర్లను కూడా భారీగా పెంచినట్లు మంత్రి చెప్పారు.

20 లక్షల కోట్లకు మొబైల్ ఫోన్ల ఉత్పత్తి

మొబైల్ ఇండస్ట్రీ రూ.19.45 లక్షల కోట్లకు చేరుకోనున్నదని ఇండస్ట్రీ బాడీ ఐసీఈఏ గురువ